సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 18 । అక్టోబర్ । 2023

I



రూ.1,11,111 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి విళ్ల వీరభద్రరావు, ఈశ్వరి దంపతులు (రామచంద్రపురం) మంగళవారం రూ.1,11,111 విరాళం సమర్పించారు.



వెయిటింగ్ హాల్ ప్రారంభం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీలో మహిళా జెడ్పీటీసీల వెయిటింగ్ హాల్‌ను మంగళవారం జెడ్పీచైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ ప్రారంభించారు.

రూ.10 లక్షల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి పళని అప్పన్ రామస్వామి, గీత దంపతులు (భీమవరం) మంగళవారం రూ.10 లక్షల విరాళం సమర్పించారు.



న్యూస్‌రీల్


నేడు వైద్యశిబిరాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): **జగనన్న** ఆరోగ్య సురక్ష కార్యక్రమం**లో భాగంగా** జిల్లాలోని ఈ కింద తెలిపిన **సచివాలయాల్లో** బుధవారం వైద్యశిబిరాలు **నిర్వహిస్తున్నట్లు** కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత **తెలిపారు. అనప**ర్తి 4, చాగల్లు 4, దేవరపల్లి **2, గోకవరం 3,** కడియపులంక 1 (కడియం), **కణుపూరు** (కోరుకొండ), తోగుమ్మి (**కొవ్వూరు), ప్రకాశ** రావుపాలెం (నల్లజర్ల), కొరు**మామిడి 2 (నిడ** దవోలు), కానూరు అగ్రహా**రం (పెరవలి),** యూపీహెచ్‌సీ మెరకవీధి **2 (రాజమహేం**ద్రవరం అర్బన్), శాటిలైట్ **సిటీ 3 (రాజమ**హేంద్రవరం రూరల్), ముక్కినాడ (రాజానగరం), దొడ్డిగుంట (రంగంపేట), నాగంపల్లి (సీతానగరం), కర్రవారి సావరం (ఉంద్రాజవరం)లో జరుగుతాయన్నారు.

నిడదవోలులో నేడు జగనన్నకు చెబుదాం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): నిడదవోలులో జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక శాసన సభ్యుడు జి. శ్రీనివాస నాయుడు, ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొంటారన్నారు. స్థానిక కొత్తపల్లి శ్రీ రాములు కనకమ్మ లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అర్జీలను జిల్లా అధికారులు స్వీకరిస్తారని వివరించారు.

సముద్రంలోకి 20,788 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 20,788 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. గోదావరి కాలువలకు సంబంధించి తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. భద్రాచలం వద్ద 7.90, బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది.

11,997 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 13వ రోజు మంగళవారం జిల్లా వ్యాప్తంగా 23 వైద్యశిబిరాలు నిర్వహించినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్‌ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు. వీటిలో 11,997 మంది రోగులు వైద్య సేవలు పొందారని, 349 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారన్నారు.

సౌత్ జోన్ చెస్ పోటీలు ప్రారంభం

పెద్దాపురం: స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో సీబీఎస్ఐ నిర్వహిస్తున్న సౌత్ జోన్ చెస్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏపీ చెస్ అసోషియేషన్ అధ్యక్షులు కెవివి శర్మ మాట్లాడుతూ ఏపీలో చాలా ఏళ్ల తరువాత చెస్ పోటీలను పెద్దాపురంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఐదు రాష్ట్రాల నుంచి సుమారు 300 పాఠశాలలకు చెందిన 1200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీల కన్వీనర్ భీమారావు మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. పోటీల చీఫ్ ఆర్బిటర్ జీవీ కుమార్ మాట్లాడుతూపోటీల్లో ప్రతీ విద్యార్థి ఆరు రౌండ్లలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఏపీ, తమిళనాడు నుంచి 25 మంది ఆర్బిటర్లు పాల్గొంటున్నారన్నారు. అనంతరం చెస్ పోటీలను ప్రారంభించారు. పాఠశాల మేనేజర్ రామకృష్ణ, అకడమిక్, కల్చరల్ కో–ఆర్డినేటర్‌లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జయలక్ష్మికి ఊపిరి

- వడ్డీ తగ్గింపుతో రుణగ్రస్తులకు ఊరట
- అన్నీ అనుకూలిస్తే వడ్డీ రూ.1.25 మాత్రమే
- మార్ట్‌గేజ్ రుణాలకే ఈ అవకాశం వర్తింపు
- బ్యాంకులతో సొసైటీ సంప్రదింపులు
- మరోపక్క టేకోవర్ చేసేందుకు బ్యాంక్ ఆసక్తి



జయలక్ష్మి బాధితులకు సత్వరన్యాయం కోసం సర్పవరం మెయిన్ బ్రాంచ్‌లో ఆడిటర్లు, డైరెక్టర్లతో మాట్లాడుతున్న ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు



జయలక్ష్మి సొసైటీ సర్పవరం మెయిన్ బ్రాంచ్‌లో ఆడిటర్లు, డైరెక్టర్ల సమావేశం

సాక్షిప్రతినిధి, కాకినాడ: వడ్డీ భారం తగ్గించి కాకినాడ జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీకి పునరుజ్జీవం పోయాలని పాలకవర్గం సంకల్పిస్తోంది. గతేడాది కోట్లు కొట్టేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి సొసైటీని బలంగా నిలిపేందుకు రుణభారం పెద్ద ప్రతిబంధకంగా మారింది. సొసైటీలో ఆస్తులు తనాఖా పెట్టి తీసుకున్న రుణాలపై కొత్త పాలకవర్గానికి కొంత స్పష్టత లభించింది. ఎటొచ్చీ ఎటువంటి పత్రాలు లేకుండా అడ్డగోలుగా దోచిపెట్టిన కోట్లాది రూపాయిల రుణాలు వివరాలపై అయోమయం నెలకొంది. ఇలాంటి రుణాలతో పాటు కోట్లలో డిపాజిట్లను కూడా గత పాలకవర్గ సభ్యులు దారి మళ్లించేసి ఇప్పుడు జైలులో ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన సీఐడీ విచారణ ముమ్మరం చేసింది. అలాగే నిష్పక్షపాతంగా వ్యవహరించే వారితో పాలకవర్గం ఏర్పాటవడం ఆశావహ పరిణామం.

గుదిబండగా వడ్డీ భారం...

జయలక్ష్మిలో రుణాలు తీసుకున్న వారిపై నూటికి వడ్డీ రూ.1.50 నుంచి రూ.2 పడుతోంది. ఈ భారాన్ని రూపాయి లేదా రూ.1.25కు తగ్గించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందుకు పలు బ్యాంకులతో సంప్రదింపులు జరుగుతున్నాయి. జయలక్ష్మిలో రుణ మొత్తాలను టేకోవర్ చేసేందుకు ముందుకు వచ్చే బ్యాంక్‌కు బదలాయించనున్నారు. ఈ విషయంలో విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో పలు కోపరేటివ్ సొసైటీలు, వాణిజ్య బ్యాంకుల లావాదేవీలు పర్యవేక్షించే ఆడిటర్ శ్రీనివాస్ ముందుకు వచ్చారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇలా ముందుకు వచ్చే బ్యాంక్ రూ.200 కోట్లు రుణాలపై పెట్టేందుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఇప్పటికే రెండు పర్యాయాలు ఆడిటర్‌తో పాలకవర్గం సంప్రదింపులు జరిపింది. జయలక్ష్మిలో చర, స్థిర ఆస్తులు తనఖా పెట్టి పక్కాగా మార్ట్‌గేజ్ చేసి రికార్డుల ప్రకారం పక్కాగా ఉన్న రుణాలను మాత్రమే టేకోవర్ చేస్తారు. ఇలాంటి రుణాలు రూ.160 కోట్లు వరకు ఉన్నాయి. వీటిపై రూపాయి నుంచి రూ.1.25లు వడ్డీ మాత్రమే వసూలు చేయడానికి ఇరుపక్షాల మధ్య సంప్రదింపులు జరిగాయి. బ్యాంక్ టేకోవర్ చేసి పక్కాగా ఉన్న రుణ మొత్తాన్ని జయలక్ష్మికి జమచేస్తే సీఐడీ కస్టడీలో ఉన్న డాక్యుమెంట్లను పాలకవర్గం తీసుకువస్తుంది. సంబంధిత బ్యాంక్‌కు అప్పగిస్తుంది.



ప్రయత్నాలకు అడుగులు

కొత్త పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఎడతెగని ప్రయత్నాలు చేస్తూనే ఉంది. నాలుగైదు నెలల క్రితం సొసైటీని టేకోవర్ చేసేందుకు చెన్నైకు చెందిన ఒక బడా ఫైనాన్స్ కంపెనీ ముందుకు వచ్చింది. అయితే ఆ ప్రయత్నాలు కొలిక్కి రాలేదు. డిపాజిటర్లను షేర్‌హోల్డర్లుగా తీసుకుని జయలక్ష్మి ఖాతాదారులకు భరోసా కల్పించాలని కూడా భావిస్తున్నారు. డిపాజిట్లలో 40శాతం షేర్‌హోల్డర్‌షిప్, 60శాతం సేవింగ్ అకౌంట్స్‌లుగా మార్పు చేయాలనుకున్నా ఫలితాన్నివ్వ లేదు.

ఈ క్రమంలో సొసైటీలో చర, స్థిర ఆస్తులు తనఖాపెట్టి (మార్ట్‌గేజ్) రుణాలు తీసుకున్న వారికి రుణాలపై పడుతోన్న వడ్డీ భారంగా మారిందని పాలకవర్గం ఇటీవల గుర్తించింది. సొసైటీలో ఖాతాదారులు గట్టెక్కాలంటే రుణాలపై వడ్డీ భారం తగ్గించాల్సి ఉంది. ఇప్పటికిప్పుడు ఈ పని సాధ్యం కాదు. అలాగని అసలు మూలాన్ని విడిచిపెట్టేస్తే పునరుజ్జీవ ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. బ్యాకింగ్ రంగంలో నిష్ణాతులైన ఆడిటర్లతో పాలకవర్గ సభ్యులు సంప్రదింపులు జరిపారు. వారి సూచనల మేరకు ముందుగా జయలక్ష్మిలో రుణగ్రస్తు ల సమస్యకు పరిష్కారం చూపాలని నిర్ణయించారు.

సగం తగ్గిపోనున్న భారం...

పాలకవర్గ ప్రయత్నాలు ఫలిస్తే రుణాలపై ఇంతవరకు ఉన్న వడ్డీ భారం సగానికి సగం తగ్గిపోతుంది. ఈ ప్రతిపాదనకు సమ్మతించి ముందుకు వచ్చే బ్యాంకు రుణగ్రస్తులకు సంబంధించిన ఆస్తి పత్రాలను తీసుకుని ఆ మేరకు రుణాలను జయలక్ష్మికి జమచేయనుంది. రుణాలను టేకోవర్ చేసేందుకు ముందుకు వచ్చే బ్యాంక్ రుణమొత్తాన్ని జమచేయడంతో జయలక్ష్మి రుణభారం నుంచి బయటపడుతుంది. అదే సందర్భంలో వచ్చిన సొమ్ముతో జయలక్ష్మిని బలోపేతం చేయాలని పాలకవర్గం భావిస్తోంది. రుణగ్రస్తులతో మాట్లాడి రుణాలను జయలక్ష్మిలో రద్దుచేసి టేకోవర్ బ్యాంక్‌కు బదలాయించే అంశంపై అంగీకారం తీసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు సానుకూలత వ్యక్తం చేశారు. మెజార్టీ రుణగ్రస్తులు ఆసక్తికనబరిస్తే ఈ ప్రక్రియను ముందుకు తీసుకు వెళ్లాలని పాలకవర్గం యోచిస్తోంది. అధిక వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి నుంచి ఖాతాదారులకు ఉపశమనం లభించనుంది. రుణాలు తగ్గిపోతే సొసైటీ దానంతట అదే గట్టెక్కుతుందని నమ్ముతున్నారు. ఈ ప్రక్రియను చేపట్టేందుకు సహకార రంగ బ్యాంకులతో పాలకవర్గం జరుపుతున్న సంప్రదింపులు కొలిక్కి రావాలని ఖాతాదారులు అభిలషిస్తున్నారు.

సభ్యులకు సత్వర న్యాయం



మహాజనసభ ద్వారా ఎన్నికైన కార్యవర్గం సొసైటీ సభ్యులందరికీ సత్వర న్యాయం జరిగేలా కృషి చేస్తోంది. ఏడాది పూర్తయిన తరువాత మాపై నమ్మకంతో మరో ఐదేళ్లు కొనసాగేలా ఇటీవల కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మొండి బకాయిలను వసూలు చేసే క్రమంలో సీఐడీ అధికారులకు సహకరిస్తూ ఖాతాదారులకు న్యాయం జరిగేలా చూస్తున్నాం. ఇప్పటికే రూ.3.50 కోట్లు వసూలు చేశాం. గత పాలకవర్గంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కుటుంబ సభ్యులు, డైరెక్టర్లు, ఎటువంటి హామీలు లేకుండా పక్కదారి మళ్లించిన సొమ్మును తిరిగి రాబట్టేంనకన సంబంధించిన ఆస్తులను గుర్తిస్తున్నాం. డిపాజిటర్లు తమ రుణాలను భారంగా భావించడంతో వారికి ఉపశమనం కలిగించేలా వేరే బ్యాంకు ద్వారా టేక్‌వోవర్ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల రుణభారం తగ్గుతుంది. ఇతర బ్యాంకులు ద్వారా తక్కువ వడ్డీకే వాయిదాల్లో చెల్లించుకునే వెసులుబాటు లభిస్తోంది.

గంగిరెడ్డి త్రినాథరావు, ఛైర్మన్, జయలక్ష్మి సొసైటీ

బాధితులకు ఉపశమనం



జయలక్ష్మి సొసైటీ గత పాలకవర్గం మా నమ్మకాన్ని దెబ్బతీసింది. మాకు అధిక వడ్డీలు చూపించి, డిపాజిట్లు సేకరించింది. తర్వాత మమ్మల్ని మోసగించి బోర్డు తిప్పేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి అండగా నిలిచింది. సొసైటీ అధికారులతో పాటు సీఐడీ అధికారులతో విచారణ జరిపించింది. సభ్యులంతా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నాం. ఈ కార్యవర్గం బాధితులకు అండగా నిర్ణయాల తీసుకుంటూ ఉపశమనం కలిగించడం సంతోషకరం. చిన్న చిన్న డిపాజిట్లు ఉన్నవారు అధిక వడ్డీలతో భయపడుతున్నందున వారికి కొత్తగా ఇతర బ్యాంకుల ద్వారా టేక్‌వోవర్ చేసే ప్రక్రియ ప్రయోజనకరంగా ఉంటోంది.

వంకాయల కృష్ణ, బాధితుడు, కాకినాడ.

సుందర నగరంగా రాజమహేంద్రవరం

- రూ.177 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రత్యేక ఆకర్షణగా పార్కులు
- మంత్రి ఆదిమూలపు సురేష్



పుష్కర ప్లాజా స్ట్రీట్ స్కేపింగ్ పనులు చేపడుతున్న గోదావరి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి ఆదిమూలపు సురేష్ చిత్రంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత,కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు



కంబాలచెరువులో ఏర్పాటు చేసిన అధునాతన పార్కు

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో రాజమహేంద్రవరం సుందర నగరంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో రూ.177 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు మంగళవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్, అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆ క్రమంలోనే రాజమహేంద్రవరంలో మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు సుమారు రూ.330 కోట్లతో పనులు చేపట్టారన్నారు. ప్రజలకు రెండు పూటలా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించారన్నారు. భద్రతతో కూడిన మెరుగైన పరిపాలన అందించేందుకు కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోందన్నారు. ఈ అభివృద్ధి పనులు రాజమహేంద్రవరం నగరం పట్ల సీఎంకు ప్రత్యేక అనుబంధాన్ని చాటుతున్నాయన్నారు. రూ.125 కోట్లు ప్రత్యేకంగా విడుదల చేశారన్నారు. విశాల రహదారులు, మెరుగైన డ్రైనేజీ, సెంట్రల్ బ్యూటిఫికేషన్, ఆహ్లాదకర పార్కులు వంటి పనులతో స్మార్ట్ సిటీ దిశగా మరింత అభివృద్ధి చేస్తామని సురేష్ తెలిపారు. 37 పార్కులు వినూత్నమైన సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులో తీసుకువచ్చామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ నగరంలో డాగ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

నిధులకు కృషి : కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలతో మాట్లాడుతూ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి హోదాలో ఏడాదిన్నరగా నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చేపట్టేందుకు తాజాగా శంకుస్థాపనలు చేశారన్నారు. క్లీన్ ఆంధ్ర ప్రదేశ్‌లో భాగంగా నగరాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచడంలో జిల్లా, నగరపాలక సంస్థ యంత్రాంగానికి సహకరించాలని ప్రజలను కోరారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే పలు గ్రాంట్లను తీసుకువచ్చామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ నగరంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమాల్లో ఇంజినీరింగ్ చీఫ్ ఆనందరావు,ఆర్‌ఎంసీ అధికారులు పీఎం సత్యవేణి, జి.పాండురంగారావు, కే.సాంబశివరావు, రుడా మాజీ ఛైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, నగర కోఆర్డినేటర్ గూడూరు శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు–శంకుస్థాపనల వివరాలు

- కార్పొరేషన్ కార్యాలయంలో రూ.4.60 కోట్లతో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూం, మీటింగ్ హాలు ప్రారంభోత్సవం
- రూ.6 కోట్లతో చేపట్టిన ఆనం కళాకేంద్రం, పుష్కర ప్లాజా ప్రారంభోత్సవం
- రూ.5 కోట్లతో పుష్కర ప్లాజా స్ట్రీట్ స్కేపింగ్ పనులకు శంకుస్థాపన
- రూ..22 కోట్లతో చేపడుతున్న గోదావరి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ పనుల శంకుస్థాపన
- రూ.10 కోట్లతో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ పనులకు శంకుస్థాపన
- రూ.95.50 కోట్లతో చేపడుతున్న ఎంఎల్‌డీఎస్ టీపీ కింద ఎస్ఆర్‌సీడీ పనులకు శంకుస్థాపన
- రు.11.57 కోట్లతో ఆవ రోడ్డు వద్ద ఎస్‌టీపీ పనులకు శంకుస్థాపన, 100 అడుగుల రోడ్డు ప్రారంభం.
- రూ.2.07 కోట్లతో నాడు నేడు కింద చేపట్టిన లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలు ప్రారంభం
- రూ.2.00 కోట్లతో మోరంపూడి – పద్మావతి నగర్‌లో నిర్మించిన స్విమ్మింగ్ పూల్ ప్రారంభం
- రూ.2.60 కోట్లతో ఎ.కె.సి. కాలేజ్ వద్ద గల నిర్మించిన పార్కు ప్రారంభం
- రూ.6 కోట్లతో వై జంక్షన్ వద్ద జగనన్న స్మార్ట్ రోడ్ పనులకు శంకుస్థాపన
- రూ.15 కోట్లతో కంబాల చెరువు వద్ద చేపట్టిన అభివద్ధి, సుందరీకరణ పనులకు ప్రారంభోత్సవం

సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ కబడ్డీ టోర్నీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నవంబర్ 9 నుంచి 12వ వరకూ ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ కబడ్డీ (మెన్) పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వర్సిటీ పీఆర్‌ఓ సాయిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీ బ్రోచర్‌ను ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, వీసీ ప్రసాదరాజు నన్నయ వర్సిటీలో ఆవిష్కరించారని, పోటీలకు ఏపీ, తెలంగాణతో పాటు కర్నాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ ఆరు రాష్ట్రాలలో 100 యూనివర్సిటీల నుంచి 1200 మంది క్రీడాకారులు, 300 మంది కోచ్, అధికారులు టోర్నీకి హాజరవుతారన్నారు. బ్రోచర్ ఆవిష్కరణలో వర్సిటీ వీసీ కొప్పిరెడ్డి పద్మరాజు, ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి పాల్గొన్నారని తెలిపారు.

నేడు జిల్లా స్థాయి చెస్ పోటీలు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం విద్యానిధి స్కూల్‌లో బుధవారం అండర్-13 జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ మంగళవారం తెలిపారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు 2010 జనవరి 1 తరువాత జన్మించి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 98491 75179 నెంబరులో సంప్రదించాలన్నారు.

టాపర్లతో.. ఓ సెల్ఫీ

- వినూత్న కార్యక్రమానికి విద్యాశాఖ శ్రీకారం
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహం
- ఉత్తమ ప్రతిభ చూపిన వారితో ఉపాధ్యాయుల సెల్ఫీలు
- సామాజిక మాధ్యమాల్లో ప్రచారం



శాటిలైట్ సిటీ హైస్కూల్లో ఏడో తరగతి టాపర్లతో సెల్ఫీ దిగుతున్న ప్రధానోపాధ్యాయురాలు రాజరాజేశ్వరి

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సెల్ఫీ విత్ టాపర్ పేరుతో పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు గురువులతో సెల్ఫీ ఇప్పిస్తోంది. దీని ద్వారా వారిలో పోటీతత్వం పెరిగి మరింత మెరుగ్గా రాణించేందుకు అవకాశం ఉంటుందని విద్యావేత్తలు భావిస్తున్నారు. గురువంటే ఎవరికైనా ఆదర్శమే. అలాంటి గురువే విద్యార్థితో సెల్ఫీ తీసుకుని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే ఆ విద్యార్థి ఆనందం మాటల్లో చెప్పలేనిది. దీనిని గుర్తించిన ప్రభుత్వం 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో ఏడాది పొడవునా నిర్వహించే పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో జిల్లా స్థాయి అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు సెల్ఫీలు దిగి, వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తూ విద్యార్థులను ప్రోత్సహించనున్నారు. ఎఫ్ఏ-2 (ఫార్మేటివ్ అసెస్‌మెంట్) పరీక్షల నుంచి దీనిని అమలు చేయాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు.

జిల్లాలో 1,22,499 మంది విద్యార్థులు

జిల్లాలో వివిధ యాజమాన్యాల కింద 712 ప్రాథమిక, 73 ప్రాథమికోన్నత, 201 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో 1,22,499 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరినీ 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమం ద్వారా ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో వారి ప్రతిభ గురించి ప్రచారం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఎఫ్ఏ–2 పరీక్షల నుంచి అమలు

ఎఫ్ఏ-2 పరీక్షల తర్వాత జిల్లా వ్యాప్తంగా 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమం అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులు నిర్ణయించారు. ఈ నెల 3 నుంచి ఆరో తేదీ వరకూ నాలుగు రోజుల పాటు ఎఫ్ఏ-2 పరీక్షలు జరిగాయి. మూల్యాంకనం పూర్తయిన వెంటనే విద్యార్థుల మార్కులను వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాను రూపొందించి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో టాపర్ల జాబితా తయారు చేశారు. ఆ వెంటనే 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలలకూ ఆదేశాలు అందడంతో ఎఫ్ఏ-2 పరీక్షల టాపర్లతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే..



ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు.

– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

దారి దోపిడీ దొంగలకు జైలుశిక్ష

మండపేట: దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురికి రెండేళ్ల చొప్పున జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ ఆలమూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ కె.దీపదైవకృప మంగళవారం తీర్పు చెప్పారు. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. గత ఏడాది మే నాలుగో తేదీ అర్ధరాత్రి స్థానిక బైపాస్ రోడ్డు వద్ద రావూరి వీరాంజనేయ, సవరపు దేవసంపత్, బందారు బాలవెంకట నాగసుందర్‌లు తన లారీ ఆపి, దౌర్జన్యం చేసి, జేబులో ఉన్న నగదు, రెండు సెల్‌ఫోన్లు లాక్కున్నట్టు బాధితుడు సయ్యద్ అబ్దుల్ రషీద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో విల్లా శ్రీరాములు ప్రాసిక్యూషన్ నిర్వహించారు. నేరం రుజువు కావడంతో ముగ్గురు ముద్దాయిలకు కోర్టు పై విధంగా శిక్ష విధించింది.

బాలుడి మృతదేహం లభ్యం


సాయి మృతదేహం

పి.గన్నవరం: కె.ఏనుగుపల్లి గ్రామంలో వైనతేయ గోదావరి నదిలో స్నానం చేస్తూ గల్లంతైన అమలాపురం పట్టణం వడ్డిగూడేనికి చెందిన బాలుడు సాధనాల సాయి (15) మృతదేహం మంగళవారం లభ్యమైంది. కె.ఏనుగుపల్లిలోని అమ్మమ్మ ఇంటికి వచ్చిన సాయి.. తమ్ముడు దుర్గేష్, మరో ముగ్గురు బాలురతో కలిసి నదిలో స్నానం చేస్తుండగా, ప్రమాదవశాత్తూ గల్లంతైన విషయం విదితమే. ప్రమాద ప్రాంతానికి సమీపంలోనే సాయి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరికోటిశాస్త్రి తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

దేవరపల్లి: మనస్తాపంతో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఎస్సై కె. శ్రీహరిరావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. యర్నగూడెం గ్రామానికి చెందిన గుంపుల శ్రీనివాస్ (52) సోమవారం రాత్రి మద్యం తాగాడు. ఇంట్లో ఆర్థిక పరిస్థితులతో మనస్తాపానికి గురై, పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు తొలుత గోపాలపురం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో శ్రీనివాస్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇంగ్లిషా.. తగ్గేదే లే..

- ఆంగ్లం.. వారికి కరతలామలకం
- అనర్గళంగా మాట్లాడేస్తున్న మన కుర్రాళ్లు
- త్వరలో మాక్ జీ–20 సదస్సులో సత్తా చూపనున్న విద్యార్థులు


మాక్ జీ-20 నియోజకవర్గ సదస్సులో విదేశీ ప్రతినిధులుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు (పాత చిత్రం)

పిఠాపురం: నిన్నమొన్నటి వరకూ ఇంగ్లిషు మాట్లాడటమంటేనే వారికి తెలీదు. పైగా అమ్మ ఒడిలో ఉన్నప్పటి నుంచీ వినని భాష కావడంతో తెలియని బెరుకు. కానీ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకు వచ్చిన సంస్కరణలతో మన విద్యార్థుల్లో ఆ బెరుకు, వెనుకబాటుతనం పూర్తిగా మాయమయ్యాయి. ఇప్పటికే బెండపూడి విద్యార్థులు అమెరికన్ యాక్సెంట్‌లో ఆంగ్ల సంభాషణలతో అదరగొట్టి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశంసలు కూడా అందుకున్నారు. మరికొంతమంది ఏకంగా ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించి, శభాష్ అనిపించుకున్నారు. దీనికి కొనసాగింపుగా కాకినాడ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఇప్పుడు మరో మెట్టు పైకెక్కారు. ఇంగ్లిషులో చకచకా మాట్లాడటమే కాదు.. వివిధ దేశాల శైలిలో అనర్గళంగా ప్రసంగించే స్థాయికి చేరుకున్నారు. మన తెలుగు భాషకే ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఉచ్చారణ శైలి ఉంది. అదేవిధంగా ఆంగ్ల భాషను కూడా ఒక్కో దేశంలో ఒక్కో శైలిలో మాట్లాడుతుంటారు. దీనిని మన విద్యార్థులు ఒడిసిపట్టారు. దేశమేదైనా.. భాష ఏదైనా.. తగ్గేదే లే.. అంటున్నారు. త్వరలో కాకినాడ జిల్లా స్థాయిలో జరిగే మాక్ జీ–20 సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులుగా పాల్గొనేందుకు పలు పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. తద్వారా పేద విద్యార్థులు సైతం ఇంగ్లిషు చదువుల్లో రాణించాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాన్ని వారు మరోసారి నిజం చేయనున్నారు. కలెక్టర్ కృతికా శుక్లా, పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు నాగమణి, యూనివర్సిటీ ఇంగ్లిషు ప్రొఫెసర్ల సమక్షంలో కలెక్టరేట్‌లో త్వరలోనే ఈ సదస్సు జరగనుంది.

రైజ్‌తో ఆంగ్ల విద్యోదయం

ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను గ్లోబల్ స్థాయిలో తీర్చిదిద్దే లక్ష్యంతో కలెక్టర్ కృతికా శుక్లా రెడీనెస్ ఇనీషియేటివ్ ఫర్ సిచ్యువేషనల్ ఇంగ్లిష్ (రైజ్) కార్యక్రమం రూపొందించారు. ఒక విద్యార్థి రోజువారీ కార్యక్రమాల్లో ఏ విషయమైన మొత్తం ఇంగ్లిషులోనే చెప్పగలిగేలా తీర్చిదిద్దే లక్ష్యంతో రైజ్ కార్యక్రమం అమలు చేస్తున్నారు. దీని ద్వారా తుని నియోజకవర్గంలోని 34 ఉన్నత పాఠశాలల్లో సుమారు 1,500 మంది విద్యార్థులు ఇంగ్లిషులో నిష్ణాతుల్ని చేశారు. ఇది విజయవంతమైంది. అనంతరం కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న ఆనంద నిలయం బాలుర వసతి గృహంతో కలిపి మొత్తం 47 హైస్కూళ్లు, 50 ప్రాథమిక పాఠశాలలు, పిఠాపురం నియోజకవర్గంలోని 50 ప్రాథమిక, 12 ప్రాథమికోన్నత, 32 ఉన్నత పాఠశాలల్లో కూడా రైజ్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశారు. ఈ విద్యా సంవత్సరం జగ్గంపేట నియోజకవర్గంలోని దీనిని ప్రారంభించారు. దీని కోసం నియోజకవర్గంలోని 75 మంది హైస్కూలు ఆంగ్ల ఉపాధ్యాయులకు, 90 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. 'బెండపూడి సార్'గా పేరొంది, ప్రస్తుతం పి.దొంతమూరు జెడ్పీ హైస్కూలులో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్న గంటా ప్రసాద్ కో ఆర్డినేటర్‌గా, 12 మంది ఇంగ్లిష్ సబ్జెక్ట్ నిపుణులతో కలిసి, రైజ్ మాడ్యూల్ రూపొందించారు. పెద్దాపురం నియోజకవర్గంలో కూడా ఈ కార్యక్రమం అమలవుతోంది.

మాక్ జీ-20 సదస్సుకు విదేశీ ప్రతినిధులుగా ఎంపికైన విద్యార్థులు వీరే..

విద్యార్థి పేరు	హైస్కూలు	ప్రాతినిధ్యం వహించే దేశం
1. జి.దుర్గరాజు	నాగులాపల్లి	యూఎస్ఏ
2. హనీ	పి.వెంకటాపురం	ఆస్ట్రేలియా
3. లాస్య	పి.తిమ్మాపురం	రష్యా
4. లక్ష్మీప్రసన్న	శంఖవరం	యూకే
5. దివ్య	పి.దొంతమూరు	జపాన్
6. భానుశ్రీ	పి.దొంతమూరు	ఇటలీ
7. లక్ష్మీ ప్రసన్న	ఏకేపీఎం హైస్కూలు, పిఠాపురం	జర్మనీ
8. విజయ	పి.దొంతమూరు	ఇండియా
9. లలితా భువనశ్రీ	వేలంక	టర్కీ
10. లాస్య	మల్లేపల్లి	అర్జంటీనా
11. గనన్య	ఎస్.సూరవరం	బ్రెజిల్
12. భువనశ్రీ	పి.వెంకటాపురం	దక్షిణాఫ్రికా
13. తేజ వెంకట శ్రీసాయి	రాజుపూడి	ఆఫ్రికా
14. మదర్ థెరీసా	తుని	ఇండోనేషియా
15. మధుప్రియ	నాగులాపల్లి	చైనా
16. లక్ష్మణ్	తాళ్లూరు	సౌదీ అరేబియా
17. అపర్ణ	వన్నెపూడి	ఫ్రాన్స్
18. చిన్నారి	తామరాడ	కెనడా
19. ఇందువర్షిణి	మల్లేపల్లి	ఈయూ
20. జెరుషా	మాధవపట్నం	మెక్సికో

ఇంత బాగా నేర్చుకుంటాననుకోలేదు



మామూలుగా ఇంగ్లిషు చదవడం అంటే కష్టంగా ఉండేది. పరీక్షల్లో పాసవ్వాలనే పట్టుదలతో ఇంగ్లిషు చదివేదానిని. కానీ రైజ్ ప్రోగ్రాం ద్వారా మా పాఠశాలలో ప్రసాద్ మాస్టారు ఇంగ్లిషు చదవడం, మాట్లాడటం నేర్పించారు. తక్కువ సమయంలోనే అనర్గళంగా ఇంగ్లిషు మాట్లాడడం నేర్చుకున్నా. మామూలుగా ఇంగ్లిషు మాట్లాడటం ఒక ఎత్తయితే.. వేరే దేశ ఉచ్చారణలో మాట్లాడటం మరో ఎత్తు. ప్రస్తుతం ఇటలీ యాక్సెంట్‌లో మాట్లాడటం నేర్చుకున్నాను. మాక్ జీ–20 జిల్లా సదస్సుకు ఇటలీ ప్రతినిధిగా ఎంపికయ్యాను.

– కె.శశి భానుశ్రీ, పదో తరగతి, పి.దొంతమూరు, పిఠాపురం మండలం

నేర్చుకోవాలనే తపన కలిగిస్తున్నారు



ఇంగ్లిషులో పాఠాలు చదువడం తప్ప మాట్లాడటం వచ్చేది కాదు. ఇంగ్లిషు మీడియం స్కూల్లో చదువుకున్న వారిని చూస్తే మాకు ఇలా నేర్పితే బాగుండునను కునే దానిని. సీఎం వైఎస్ జగన్ మావయ్య ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు విద్య అమలు చేస్తుండటంతో మాకు ఈ అవకాశం వచ్చింది. బలవంతంగా చెప్పడం కాకుండా మాకే చదువుకోవాలనిపించేలా చెబుతున్నారు. దీంతో తక్కువ కాలంలోనే ఇంగ్లిషు అనర్గళంగా మాట్లాడే స్థాయికి చేరుకున్నాం. జీ–20 జిల్లా సదస్సుకు ఫ్రాన్స్ ప్రతినిధిగా ఎంపికయ్యాను.

– అపర్ణ, పదో తరగతి, వన్నెపూడి, గొల్లప్రోలు మండలం

ప్రపంచ దేశాల్లో మనమే ఫస్ట్



అభివృద్ధి చెందిన దేశాలున్న కూటమి పాల్గొన్న జీ–20 సదస్సును కేవలం తెలుగు తప్ప ఏ భాషా సక్రమంగా రాని సాధారణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో నిర్వహించడం గొప్ప విజయంగా చెప్పవచ్చు. అతి తక్కువ సమయంలోనే విద్యార్థులు ఆయా దేశాల ఉచ్చారణ శైలిని అనుకరించి, అనర్గళంగా మాట్లాడటం పెద్దపెద్ద ప్రొఫెసర్లనే ఆశ్చర్యానికి గురి చేసింది. నియోజకవర్గ స్థాయిలో మాక్ జీ–20 సదస్సు విజయవంతంగా నిర్వహించాం. ప్రపంచ వ్యాప్తంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ టచ్ స్క్రీన్స్‌పై పాఠాలు చెప్పే 3,800 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణల వల్లే ఇదంతా సాధ్యమైంది. ప్రైవేటు పాఠశాలలకు మించిన ప్రతిభతో మన విద్యార్థులు దూసుకుపోతున్నారు.

– జీవీ ప్రసాద్, కో ఆర్డినేటర్, రైజ్, కాకినాడ జిల్లా

సముద్రంలో మత్స్యకారుడి గల్లంతు


గల్లంతైన కృపారావు (పాత చిత్రం)

కొత్తపల్లి: వేటకు వెళ్లిన మత్స్యకారుడు మంగళవారం ప్రమాదవశాత్తూ సముద్రంలో పడి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పాడ శివారు నాయకర్ కాలనీ–2కు చెందిన వంక కృపారావు, అదే గ్రామానికి చెందిన పిరమర్ల నూకరాజు, మరో 18 మంది మత్స్యకారులు సోమవారం రెండు బోట్లపై అమీనాబాద్ తీరప్రాంతం నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లారు. సముద్రంలో వల వేస్తుండగా మంగళవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ కాలుకు తాడు తగులుకోవడంతో కృపారావు సముద్రంలో పడి గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం తోటి మత్స్యకారులు, మెరైన్ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. కృపారావు చిన్నాన్న వంక ప్రభుదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కృపారావుకు భార్య కరుణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి కోసం పిల్లలు దిగులుగా చూస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టిస్తోంది. ఆ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, మండల


రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ పరామర్శించారు. విషయాన్ని ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి, గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని, అవసరమైతే హెలికాప్టర్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టాలని మెరైన్ పోలీసులను ఆదేశించారు.

ఏపీ ఒలింపిక్ సంఘ సీఈఓగా గోవిందరాజు



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి(సీఈఓ)గా కాకినాడ జిల్లా ఒలింపిక్ సంఘ చైర్మన్ చుండ్రు గోవిందరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు పురుషోత్తం నుంచి ఆయన మంగళవారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ నెల 12న విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం సర్వసభ్య సమావేశంలో గోవిందరాజును సభ్యులు సీఈఓగా ప్రతిపాదించి, తీర్మానం చేశారు. 58 సంవత్సరాల క్రీడానుభవం కలిగిన ఆయన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఒలింపిక్ సంఘానికి అధ్యక్షునిగా సేవలు అందించారు. అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లో ప్రావీణ్యం కలిగిన గోవిందరాజు 1969–70లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తరపున ఖోఖోకు ప్రాతినిధ్యం వహించారు. 25 సంవత్సరాలుగా షటిల్ బ్యాడ్మింటన్, 20 ఏళ్లుగా ఒలింపిక్ సంఘంలో వివిధ హోదాల్లో పని చేసి, జిల్లా క్రీడాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. బ్యాడ్మింటన్‌లో నాలుగుసార్లు జాతీయ స్థాయిలో, ఒకసారి అంతర్జాతీయ స్థాయిలో (స్పెయిన్) పాల్గొన్నారు. ఏపీ ఒలింపిక్ సంఘ సీఈఓగా నియమితులైన గోవిందరాజును జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, మాజీ చైర్మన్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి, కార్యదర్శి డాక్టర్ జి.ఎలీషాబాబు, చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, సభ్యులు బి.కృష్ణమూర్తి, రవిరాజు అభినందించారు.

సమన్వయంతో ఖరీఫ్ సాగు

- ఉమ్మడి 'తూర్పు' జెడ్పీ సమావేశంలో మంత్రి వేణు
- పాల్గొన్న చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సభ్యులు
- బీసీ కులగణనపై సీఎం జగన్‌కు ధన్యవాదాలు


జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ. వేదికపై ఎంపీ వంగా గీత, జెడ్పీ చైర్మన్ విప్పర్తి, కలెక్టర్లు, జేసీ తదితరులు

కాకినాడ సిటీ: ఖరీఫ్ సీజన్‌ను విజయవంతంగా ముగించేందుకు వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం కాకినాడ జెడ్పీ కార్యాలయం జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది. ఖరీఫ్ సాగు నీరు, ఎరువులు, ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ నమోదు, కౌలు రైతులకు రుణాల మంజూరు, రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా ధాన్యం సేకరణ, రబీ సన్నద్ధత, ఇరిగేషన్ కాలువల ఆధునీకరణ, పూడికల తొలగింపు పనులు, ఉద్యాన పంటల సాగు, రైతులకు రాయితీ, పౌర సరఫరాల సంస్థ ద్వారా ఖరీఫ్ ధాన్యం సేకరణపై భవిష్యత్తు కార్యాచరణ, రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరు, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు, మన బడి నాడు–నేడు పనులు, బిల్లుల ఆమోదం, సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, గృహ నిర్మాణాలు, గిరిజన సంక్షేమం, జగనన్న పాల వెల్లువ, స్త్రీ, శిశు సంక్షేమం వంటి వివిధ అంశాలపై సమావేశంలో సభ్యులు చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ, పౌర సరఫరాల శాఖకు సంబంధించి ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించడంపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అంశంపై చర్చించి, ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. రాష్ట్రంలో బీసీ కులగణన చేపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానించాలని సభ్యులను కోరారు. ఈ తీర్మానాన్ని సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు.

పుష్కలంగా ఎరువులు

వ్యవసాయ శాఖపై సమీక్ష సందర్భంగా ఆ శాఖ అధికారులు మాట్లాడుతూ, కాకినాడ జిల్లాకు సంబంధించి సచివాలయాల పరిధిలోని గోదాముల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రబీ అవసరాలకు 20 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖరీఫ్‌లో 2.16 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారుగా 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తెలిపారు. కౌలు రైతులకు సుమారు 54 వేల సీసీఆర్ కార్డులు పంపిణీ చేశామని, రూ.154 కోట్ల మేర పంట రుణాలు మంజూరు చేశామని వివరించారు. జిల్లాలోని బియ్యం కార్డుదారులకు గత జూలై నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నామని సంబంధిత అధికారులు వివరించారు. ఈ బియ్యంపై ప్రజల్లో అపోహలు తొలగించాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 262 ఆర్‌బీకేల ద్వారా ఖరీఫ్ ధాన్యం సేకరిస్తామంటూ సంబంధిత కార్యాచరణను వివరించారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు, హమాలీల కూలీ, రవాణా వంటి ఖర్చులను ప్రభుత్వమే వారం రోజుల్లో ఆయా రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమరుస్తామన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన టెక్నికల్, డేటా ఎంట్రీ, ఇతర సహాయ సిబ్బందిని కొత్తగా నియమించామని తెలిపారు. ధాన్యం సేకరణపై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూము ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, రైతులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్‌బీకేల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టారని అన్నారు. ధాన్యం సేకరణ విధానాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, ధాన్యం సేకరణపై రైతుల్లో ఉన్న అనుమానాలు తొలగించేందుకు కృషి చేయాలన్నారు. ఏ గ్రామంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే గ్రామానికి చెందిన రైస్ మిల్లులకు అనుసంధానం చేయాలని సూచించారు.

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్‌లు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలువల ఆధునీకరణ, గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత వంటి పనులు చేపట్టి, చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందేలా చర్యలు చేపడతామని అన్నారు. చైర్మన్‌గా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విప్పర్తి వేణుగోపాలరావు దంపతులను జెడ్పీ అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు గజమాలతో సత్కరించారు. కలెక్టర్లు, అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో కాకినాడ ఎంపీ వంగా గీత, రాజోలు, రంపచోడవరం ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీలు అనంత ఉదయ్‌భాస్కర్, కర్రి పద్మశ్రీ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, సీఈఓ ఎ.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు యువకులకు రిమాండ్

అల్లవరం: ఓ మినీ వ్యాన్‌ను అడ్డగించి, అందులో ప్రయాణిస్తున్న మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులను పోలీసులు రిమాండుకు తరలించారు. డీఎస్పీ అంబికా ప్రసాద్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. అమలాపురం సూర్యనగర్‌కు చెందిన ఓ కుటుంబం ఆదివారం ఓడలరేవు బీచ్‌కు వెళ్లింది. సాయంత్రం తిరిగి వస్తుండగా ముగ్గురు యువకులు మేడిద పవన్ మురళీకృష్ణ, వై.గణేష్ వెంకట హనురామ్, అక్కల శివ రెండు మోటార్ సైకిళ్లను ఆ మినీ వ్యాన్‌కు అడ్డంగా పెట్టారు. దుర్భాషలాడటంతో పాటు వ్యాన్‌లోని మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేసి, పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు అన్నవరపు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులను అరెస్టు చేసి, అమలాపురం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

లారీ డ్రైవర్‌కు ఆరేళ్ల జైలు

కాకినాడ లీగల్: నలుగురి మృతికి కారకుడైన లారీ డ్రైవర్‌కు ఆరేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.వెంకటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన ఊటు వీరభద్రరావు 2018లో నిర్లక్ష్యంగా, అతి వేగంగా లారీ నడుపుతూ సామర్లకోట మండలం ఉండూరు బ్రిడ్జి సమీపాన ఆటోను, బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. లారీ డ్రైవర్ వీరభద్రరావుపై తిమ్మాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో వీరభద్రరావుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

అసలు ఎవడండీ నవీన్ చౌదరి?

- బిగ్ షాట్‌గా పరిచయం
- రూ.లక్షలతో పలాయనం


నవీన్ చౌదరిగా చెప్పుకున్న వ్యక్తి

అమలాపురం టౌన్: అతడి ఊరు తెలియదు.. అసలు పేరేంటో కూడా ఎవరికీ తెలియదు.. అమలాపురం పట్టణంలో దిగీ దిగగానే తన పేరు నవీన్ చౌదరి అని, తానో బిగ్ షాట్‌నని, దేశమంతా తిరుగుతుంటానని, పెద్ద బిజినెస్ మ్యాన్‌ను అని అందరికీ కలరింగ్ ఇచ్చాడు. మాయమాటలు చెప్పి అందరి దగ్గరా డబ్బులు కాజేశాడు. మూడు నెలల తిరగకుండానే రూ.లక్షలతో పలాయనం చిత్తగించాడు. అతడి మాటలు నమ్మి ఓ కారు, రూ.7 లక్షలు పోగొట్టుకున్న పట్టణానికి చెందిన కదలి పృథ్వి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. సీఐ టి.క్రాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిలియనీర్‌నంటూ నమ్మించి..

సీఐ కథనం ప్రకారం.. మూడు నెలల క్రితం నవీన్ చౌదరి పేరుతో ఓ 26 ఏళ్ల యువకుడు అమలాపురం సప్తగిరి అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో అద్దెకు దిగాడు. తానో పెద్ద బిజినెస్ మ్యాన్‌నంటూ అందరికీ పరిచయం చేసుకున్నాడు. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, జంగారెడ్డిగూడేల్లో తనకు బడా వ్యాపార సంస్థలున్నాయంటూ అందరినీ నమ్మించాడు. తాను బ్రాండెడ్ దుస్తులు, వస్తువులే తప్ప మరోటి వాడనంటూ అందరి ఎదురుగా బిలియనీర్‌లా వ్యవహరించేవాడు. స్థానికంగా వినాయక చవితి విగ్రహం నిలబెట్టినపుడు రూ.50 వేలు చందా ఇచ్చి సన్మానం చేయించుకున్నాడు. పక్క వీధికి వెళ్లాలన్నా కారు దిగేవాడు కాదు. అతడి వేషధారణ, భాషా నైపుణ్యం, డబ్బులు వెదజల్లే వ్యవహార శైలి చూసిన వారంతా నిజంగానే బాగా సౌండ్ పార్టీ అనుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరికి తెలియకుండా మరొకరి దగ్గర అత్యవసరమంటూ నవీన్ చౌదరి డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. స్థానికంగా ఓ ఐసీడీఎస్ అధికారి కుమారుడైన కదలి పృథ్వి అతని మాయమాటలు నమ్మి బాగా సన్నిహితంగా మెలిగేవాడు. పృథ్వి తల్లి కారును నవీన్ చౌదరి తీసుకువెళ్లి పశ్చిమ గోదావరి జిల్లాలో అమ్మేసి రూ.10 లక్షలు తీసుకున్నాడు. అంతటితో ఆగకుండా తనకు అత్యవసరం పడిందంటూ పృథ్వి వద్ద మరో రూ.7 లక్షల అప్పు తీసుకున్నాడు. ఆ తర్వాత నుంచి నవీన్ చౌదరి కనిపించకుండా పోయాడు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో పృథ్వి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నవీన్ చౌదరి అమలాపురం పట్టణంలో అనేక మంది వద్ద రూ.50 లక్షలకు పైగా కాజేసినట్టు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అంతే కాదు.. అత్యంత తక్కువ ధరకే టైల్స్ తెప్పిస్తానంటూ స్థానికంగా ఓ బిల్డర్ వద్ద రూ.10 లక్షలు లాగేసినట్లు తెలుస్తోంది. అయితే ఒక్క పృథ్వి మాత్రమే ఫిర్యాదు చేయడం వెనుక కారణమేమిటో పోలీసులకే అంతుబట్టడం లేదు. నవీన్ చౌదరి ఊరేంటో, అసలు పేరేంటో కూడా తెలియకుండా జాగ్రత్తపడినట్లు పోలీసు వర్గాల్లోనే చర్చ సాగుతోంది. అసలు ఎవడండీ ఈ నవీన్ చౌదరి అన్న చర్చ ప్రస్తుతం అమలాపురం పట్టణంలో సాగుతోంది.

ప్రతిభ

మన చుట్టూ మనకు తెలియకుండానే ఎంతో మంది రకరకాల బాధలకు లోనవుతుంటారు. వారిలో ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల సమస్యలకు సరైన పరిష్కారం తెలియక ఇబ్బందులు పడుతుంటారు. వారి మానాన వారిని అలాగే వదిలేయడం కన్నా పరిష్కారాన్ని కనుగొంటాను అనుకున్నాడు. తనదైన మార్గంలో ప్రయత్నించాడు. విజయం సాధించాడు. సత్కారాలను పొందుతున్నాడు హైదరాబాద్ వాసి హేమేష్ చదలవాడ.


తల్లి సంధ్యతో హేమేష్ చదలవాడ

అమ్మమ్మలకు అండగా!

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందించిన 21 ఏళ్ల లోపు 20 మంది యువ సాధకులను ఢిల్లీలో మొన్న జరిగిన ‘అన్‌స్టాపబుల్ 21’ వేదికగా సత్కరించారు. హ్యూమన్ స్టడీస్, సైన్స్, క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్, సోషల్ ఇంపాక్ట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే ఏడు రంగాలలో ప్రతిభావంతులైన యువతకు ఈ సత్కారాన్ని అందజేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల హేమేష్ చదలవాడ ఎలక్ట్రానిక్స్ రంగంలో కనబరిచిన ప్రతిభకు గుర్తింపు పొందాడు.


హేమేష్ తయారుచేసిన డివైజ్

> మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతో మందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను.
> – హేమేష్

వృద్ధులకు సహాయం..

హేమేష్ పన్నెండేళ్ల వయసు నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగంలో గణనీయమైన ప్రతిభను చూపుతున్నాడు. అల్జైమర్స్ వ్యాధితో బాధపడుతున్న అమ్మమ్మను చూసి ఆమెకు ఏదైనా సాయం చేయాలనుకున్నాడు. తన ఆలోచనల గురించి హేమేష్ చెబుతూ ‘నడిచేటప్పుడు అమ్మమ్మ అడుగులు తడబడుతుండేవి. మతిమరపు ఉండేది. ఆమెకు తన మీద తనకు కంట్రోల్ ఉండేది కాదు. కొన్నిసార్లు అర్ధరాత్రి మంచంపై నుంచి లేచి ఎటో వెళ్లిపోయేది. దీంతో ఆమెను కనిపెట్టి ఉండటం కష్టమయ్యేది. అమ్మమ్మకు, ఆమెను చూసుకునే మాకూ ఇదో సవాల్‌గా ఉండేది. కొన్ని అందుబాటులో ఉన్న డివైజ్‌లను ప్రయత్నించి చూశాం. కానీ, ఏ మాత్రం సంతృప్తిగా అనిపించలేదు. అమ్మమ్మకు సాయపడే డివైజ్‌ను నేనే సొంతంగా తయారుచేయాలనుకున్నాను’ అని తనలో రూపుదిద్దుకున్న ఆలోచనను వివరిస్తాడు. హేమేష్ కృషి, పట్టుదల, అంకితభావానికి అతని తల్లిదండ్రులు కిశోర్, సంధ్యలు ప్రోత్సాహం అందించారు.

పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఈ పరికరం వాచ్‌లాగా మణికట్టుకూ కట్టుకోవచ్చు. బ్యాడ్జ్‌గానూ ధరించవచ్చు. రోగి నడక, భంగిమ, శరీర ఉష్ణోగ్రత, నాడిని పర్యవేక్షిస్తుంది. నీళ్ల జారిపడుతుండే శబ్దాన్ని కూడా గుర్తించగలదు. మనిషి దూరంగా తిరుగుతున్నప్పుడు లేదా పడిపోవడం వంటి ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే తెలియజేస్తుంది. ఇంకా అలారంలో ‘పిల్‌బాక్స్’ ఫీచర్ కూడా ఉంటుంది. ఇది రోగులు వారి మందులు తీసుకునే సమయం వచ్చినప్పుడు హెచ్చరికలను పంపుతుంది. ‘ఈ డివైజ్ మా అమ్మమ్మ కోసం తయారుచేసినప్పుడు ఇంటర్నెట్ సరైన మార్గం చూపింది. అయితే, ఈ పరికరం పూర్తయ్యేసరికి అమ్మమ్మ చనిపోయారు’ అని బాధపడే హేమేష్ డివైజ్ చేతిలో పట్టుకొని ‘మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతోమందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను’ అని చెబుతున్న హేమేష్ 12వ తరగతి చదువుతున్నాడు. తన తదుపరి ప్రాజెక్ట్స్‌తో ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ రంగంలో మరిన్ని అడుగులు వేస్తున్నట్టుగా వివరించాడు.

2021లో ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకున్నాడు. పేరున్న కంపెనీల నుంచి గ్రాంట్‌లను పొందాడు.


– నిర్మలారెడ్డి

మణిపూర్ ఒక మంచి వార్తను వినిపించింది. ఆ రాష్ట్రానికి చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ తీసిన ‘ఆండ్రో డ్రీమ్స్’ ముంబైలో జరుగుతున్న చలన చిత్రోత్సవంలో బెస్ట్ డాక్యుమెంటరీగా ఎంపికైంది. మణిపూర్‌లోని మారుమూల గ్రామం ‘ఆండ్రో’లో ఆడపిల్లల ఫుట్‌బాల్ క్లబ్‌ను 30 ఏళ్లుగా పరిస్థితులకు ఎదురీది నడుపుతున్న ‘లైబి’ అనే మహిళ పోరాటాన్ని ఈ డాక్యుమెంటరీ రికార్డు చేసింది. ఆడపిల్లల క్రీడా స్వేచ్ఛను ఎన్ని అడ్డంకులొచ్చినా కొనసాగనివ్వాలనే సందేశం ఇచ్చే ఈ డాక్యుమెంటరీ దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతోంది.

అడ్డంకులను దూరంగా తన్ని...


దర్శకురాలు: మీరా లాంగ్‌జామ్

న్యూస్‌మేకర్


ఆండ్రో డ్రీమ్స్ పోస్టర్

అంతా చేసి ఎనిమిది వేల మంది జనాభా మించని ఊరు ఆండ్రో. మణిపూర్ తూర్పు ఇంఫాల్ జిల్లాలో మారుమూల ఉంటుంది అది. అక్కడి ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడితే ఏంటి... ఆడకపోతే ఏంటి? కాని 60 ఏళ్ల లైబి మాత్రం– ఆడాల్సిందే అంటోంది. ఆమె గత ముప్పై ఏళ్లుగా ‘ఆండ్రో మహిళా మండల్ అసోసియేషన్– ఫుట్‌బాల్ క్లబ్’ (అమ్మ– ఎఫ్‌సీ) నడుపుతోంది. ఈ క్లబ్‌కు నిధులు లేవు. బిల్డింగ్ లేదు. ఊళ్లో ప్రోత్సాహం లేదూ, ఏమీ లేదు. కాని లైబి మాత్రం అంతా తానై క్లబ్‌ను నడుపుతోంది. ఈ మధ్యే ఆమె ఒక పూరి పాక నిర్మించి దానినే క్లబ్ బిల్డింగ్‌గా ప్రారంభించుకుంది.

‘అమ్మాయిలు కేవలం వంటకు, ఇంటి పనికి అంకితమై పోకూడదు. చదువుకోవాలి. ఆడాలి. ధైర్యంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి. మా ప్రాంతంలో పురుషులదే సర్వాధికారం. ఇంటి పెద్ద, తెగ పెద్ద ఎంత చెప్తే అంత. వారి దృష్టిలో ఆడవాళ్ల గురించి చింతించాల్సింది ఏమీ ఉండదు. అమ్మాయిలు ఆడతామన్నా ఒప్పుకోరు. నా పోరాటం వల్లే ఇవాళ మా ఊరి నుంచి జాతీయ స్థాయిలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు’ అంటుంది లైబి.



తన ఫుట్‌బాల్ క్లబ్ పూరి పాక ముందు లైబి

ఈమె పోరాటం ప్రపంచానికి చెప్పదగ్గది అనిపించింది మణిపూర్‌కే చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్‌కు. అలా తయారైన డాక్యుమెంటరీనే ‘ఆండ్రో డ్రీమ్స్’.

ఇద్దరి కథ

ప్రస్తుతం ముంబైలో ‘జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్’ అట్టహాసంగా జరుగుతోంది. ఇందులో ‘ఆండ్రో డ్రీమ్స్’ బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఇప్పటికే కేరళ, కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు ఎంపికైన ఈ డాక్యుమెంటరీ ముంబైలో విమర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ‘దీనికి కారణం ఆండ్రోలో అమ్మ క్లబ్‌ను నడుపుతున్న లైబి పోరాటాన్ని, ఆ క్లబ్‌లో గొప్ప ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే నిర్మల అనే అమ్మాయి ఆకాంక్షలని నేను చూపించడమే. ఒక రకంగా చాదస్త వ్యవస్థతో రెండు తరాల స్త్రీల పోరాటం ఈ డాక్యుమెంటరీ’ అని తెలిపింది మీనా లాంగ్‌జామ్.

మణిపూర్ వెలుతురు

నిజానికి మే 3వ తేదీ నుంచి మణిపూర్ వేరే కారణాల రీత్యా వార్తల్లో ఉంది. కాని మణిపూర్‌ను అభిమానించేవారికి ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ సాధిస్తున్న విజయాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. ‘నా డాక్యుమెంటరీ విజయం మా ప్రాంతంలో గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెట్టే ఉత్సాహాన్ని ఇస్తే అంతే చాలు’ అంది మీనా లాంగ్‌జామ్. మణిపూర్ యూనివర్సిటీలో కల్చరల్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా పాఠాలు చెప్పడంతో పాటు డాక్యుమెంటరీలు కూడా తీస్తుంది. 2015లో ఆమె మణిపూర్‌లో ఫస్ట్ మహిళా ఆటోడ్రైవర్‌గా ఉన్న లైబీ ఓయినమ్ మీద డాక్యుమెంటరీ తీస్తే దానికి చాలా పేరొచ్చింది. ఆ తర్వాత ‘అచొబీ ఇన్ లవ్’ పేరుతో పోలో ఆటకు అనువైన స్థానిక జాతి అశ్వాలపై డాక్యుమెంటరీ తీస్తే దానికీ పేరొచ్చింది. ఇప్పుడు ‘ఆండ్రో డ్రీమ్స్’ మణిపూర్ ఘనతను చాటుతోంది.

బాలికలు, యువతులు క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆంక్షలు ఉండనే ఉంటాయి. అలాంటి ప్రతి చోట అమ్మాయిలను ప్రోత్సహించే లైబి లాంటి యోధురాళ్లు, వారి గెలుపు గాథలను లోకానికి తెలిపే మీనా లాంటి వాళ్లు ఉండాలని కోరుకుందాం.

యూత్ పల్స్

ఢీ అంటే ఢీ
ఆర్ట్ ఆఫ్ డీఇన్‌ఫ్లుయెన్సింగ్

‘ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూశారు. ఇక డీఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూసే టైమ్ వచ్చింది’... ఇది తెలుగు సినిమాలో మాస్ డైలాగ్ కాదు. సోషల్ మీడియాలో ఒక కుర్రాడు పెట్టిన కామెంట్.

సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల హవా నడుస్తున్న కాలం ఇది. కస్టమర్‌లు ఏది కొనాలో, ఏ షో చూడాలో, ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతున్నారు. ఇప్పుడు ఈ ట్రెండ్‌కు అడ్డుపడే ‘డీఇన్‌ఫ్లుయెన్సింగ్’ ట్రెండ్ యువతరం నుంచే వచ్చి బలపడుతోంది. ట్రెడిషనల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ప్రాడక్ట్‌ను హైప్ చేస్తే డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆ హైప్‌ను ఛాలెంజ్ చేస్తున్నారు....





> సమస్య ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కాదు. కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు అనుసరిస్తున్న ధోరణి. వారిలో మార్పు రావాలి. సామాజిక బాధ్యత పెరగాలి. యువతలో అశాంతి, ఆందోళన రేకెత్తించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి.
> – హిమాద్రి పటేల్, డిజిటల్ క్రియేటర్

మార్కెటింగ్ డాటా అండ్ ఎనలిటిక్స్ కంపెనీ కంతార్ స్టడీ రిపోర్ట్ ప్రకారం వినియోగదారులపై ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సిఫారసుల ప్రభావం తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో ఎటు చూసినా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కనిపిస్తారు. టీ పొడుల నుంచి టీపాయ్‌ల వరకు రకరకాల ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి చిన్నచిన్న క్యాచీ వీడియోలను రూపొందిస్తారు. దీనికి భిన్నంగా ఒక ప్రాడక్ట్‌ను విశ్లేషిస్తూ విమర్శిస్తే...అదే డీఇన్‌ఫ్లుయెన్సింగ్!

‘డీఇన్‌ఫ్లుయెన్సింగ్’ హ్యాష్‌ట్యాగ్‌తో టిక్ టాక్‌లో ఈ ట్రెండ్ మొదలైంది.

సోషల్ మీడియా ఎనాలటిక్స్ ఫర్మ్ ట్యూబ్‌లర్ ల్యాబ్స్ చెబుతున్నదాని ప్రకారం గత సంవత్సరం నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. మ్యాడి వెల్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రముఖ కాస్మటిక్ స్టోర్స్‌లో పని చేసింది. కొన్ని ప్రాడక్ట్స్ పట్ల కస్టమర్‌లు ఎందుకు విముఖంగా ఉన్నారో తన స్వీయ అనుభవాలను తెలియజేసింది. ఈ ప్రభావంతో ఆమె పేరు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితా నుంచి డీఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితాలోకి చేరింది.

న్యూయార్క్‌కు చెందిన ఇరవై సంవత్సరాల క్లారా కొన్ని బ్రాండ్‌లను విమర్శిస్తూ వీడియోలు చేసింది. వాటిలో ఒకటి వైరల్‌గా మారింది. అదే సమయంలో తాను విమర్శించిన బ్రాండ్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే భయం పట్టుకుంది. అయితే తనకు తానుగా ధైర్యం తెచ్చుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

‘నేను సరియైన వివరాలతోనే వీడియో చేశాను. నేనెందుకు భయపడాలి’ అంటోంది క్లారా.

మన సెలబ్రిటీ ఒకరు ఆరోగ్య సంబంధమైన విషయాలపై కాస్త లోతుగానే మాట్లాడాడు. అయితే ఆయన అవగాహన లోపాన్ని ఒక వైద్యుడు వెంటనే ఎత్తిచూపాడు. పాపులర్ చైనీస్ వ్లోగర్ ఒకరు తన వయసు తక్కువగా కనిపించేలా సాంకేతిక మాయ చేస్తే ఎవరో కుర్రాడు కనిపెట్టి ‘ఆయన అసలు రూపం ఇది’ అని చూపాడు.

స్వీడన్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఫేక్ ట్రిప్ గురించి మరొక యువకుడు ‘ఇవి ఫొటోషాప్ చిత్రాలు’ అని నిజాన్ని బహిర్గతం చేశాడు. నిజానికి ఇలాంటివి సోషల్ మీడియాలో గతంలో లేవని కాదు. అయితే ‘డీఇన్‌ఫ్లుయెన్సింగ్’ పుణ్యమా అని ‘అది కాదు ఇది’ అని వెంటనే సాధికార సమాచారంతో స్పందించే ధోరణి పెరిగింది.

డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు వోవర్–హైప్‌డ్ ప్రాడక్ట్స్‌ను విమర్శించడమే కాదు చౌక ధరల్లో లభించే వాటి గురించి చెబుతున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్ అయిన అమెరికస్ రీడ్ ఇలా అంటున్నారు... ‘ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువ మంది సాధికారికంగా మాట్లాడడం లేదేమో అనే భావన కస్టమర్‌లలో వచ్చింది. డబ్బులు ఇస్తారు కాబట్టి సంబంధిత ప్రాడక్ట్‌ను ప్రమోట్ చేస్తారు. నిజానిజాల గురించి వారికి అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో డీఇన్‌ఫ్లుయెన్సరే నయం అనుకుంటున్నారు. నిజానికి డీఇన్‌ఫ్లుయెన్సర్ కూడా ఇన్‌ఫ్లుయెన్సరే’

కొందరు ఒక అడుగు ముందుకు వేసి ఈ ట్రెండ్‌కు ‘యాంటీ క్యాపిటలిస్ట్’ ట్రెండ్‌గా నామకరణం చేశారు.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ వల్ల వృథా ఖర్చులు తగ్గుతాయని, వేలం వెర్రికి అడ్డుకట్టపడుతుందని, పర్యావరణ కోణంలో కూడా ఈ ట్రెండ్ వల్ల మేలు జరుగుతుందని యువతరంలో ఎంతోమంది బలంగా వాదిస్తున్నారు. తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలో ఇతరులతో పంచుకుంటున్నారు. అయితే ‘డీఇన్‌ఫ్లుయెన్సింగ్’ ట్రెండ్‌పై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఉన్నాయి.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్‌కు విషయ సాధికారత, నిజాయితీ అనేవి కీలకం. అయితే ‘డీఇన్‌ఫ్లుయెన్సింగ్’ రూపంలో సూడో–అథెంటిసిటీ ముందుకు వస్తుందని, ఈ ట్రెండ్‌ను తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే విమర్శ ఉంది.

‘ఈ ట్రెండ్ కాస్త చివరికి ఎలా మారుతుందంటే ఇది కొనవద్దు. మీరు కొనాల్సింది అది అన్నట్లుగా!’ అంటుంది 26 సంవత్సరాల అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జెస్సిక.

‘ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చెప్పగానే కస్టమర్‌ల అభిప్రాయాలు రాత్రికి రాత్రి మారిపోవు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కేవలం సలహా ఇస్తారు. అంతే. ఏది కొనాలి, ఏది కొనకూడదు అనే స్వీయవిచక్షణ కస్టమర్‌లలో ఉంది. ఇన్‌ఫ్లుయెన్సర్‌లుగా మేము పారదర్శకంగా, నిజాయితీగా ఉంటాం’ అంటుంది ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కోలిన్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4,00,000 ఫాలోవర్స్ ఉన్నారు.

ప్రస్తుతం డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ హెల్త్, ఫైనాన్స్, లైఫ్‌స్టైల్ విభాగాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

‘డీఇన్‌ఫ్లుయెన్సింగ్ అనేది వాపా బలుపా?’ అనేది పక్కన పెడితే ఈ ట్రెండ్ మూలంగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రాఫిట్‌కు మాత్రమే కాదు మెరిట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చే ధోరణి, జవాబుదారీతనం పెరుగుతుంది.

● ఆటో అన్సారీ

లైఫ్ గేర్ మార్చింది


నజ్మా అన్సారీ

ఓ యువకుడు యాచకుడి వేషంలో, కేజీల మొత్తంలో కరెన్సీ నాణేలను తీసుకుని ఐఫోన్ కొనడానికి వెళ్లిన వార్త ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. మంచి వయసు, ఓపిక ఉన్న వారే ఇలా చేస్తుంటే... ఓపిక లేకపోయినా సమాజంలో గౌరవంగా బతికేందుకు బురఖా వేసుకుని ఆటో నడుపుతోంది నజ్మా అన్సారీ. అయినా ఇతరుల ముందు చేయి చాచే కంటే.. కష్టపడడమే గౌరవం అనుకుంది. ‘గేర్లు మార్చేయండి చాలు గౌరంగా బతకవచ్చు’ అని చెబుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



నజ్మా అన్సారీ వయసు 45. ఉత్తరప్రదేశ్, మొరాదాబాద్ నగరంలోని కట్‌ఘర్‌లో ఆమె నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. 2010లో భర్త మరణించడంతో ఇంటి భారం ఆమె మీద పడింది. అప్పటిదాక గృహిణిగా ఉన్న నజ్మాకు తన కొడుకు, కూతుర్ని ఎలా పెంచాలో అర్థం కాలేదు. భర్త నడిపిన టీషాపును అద్దె కట్టలేక వదిలేసింది. ఇంట్లోనే టీ తయారు చేసి విక్రయించింది. అలా పిల్లల అవసరాలు చూసుకుంటూ ఉండగానే భర్త ఇన్సురెన్స్ డబ్బులు రూ.4.35 లక్షలు వచ్చాయి. మూడు లక్షల రూపాయలతో 2015లో కూతురికి పెళ్లి చేసింది.

ఆదాయం సరిపోక..

టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్న నజ్మాకు డబ్బులు సరిపోయేవి కావు. కూతురి పెళ్లి తరువాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో భర్త ఇన్సురెన్స్ డబ్బుల్లో మిగిలిన మొత్తంతో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కుంది. ఇంటి పనులన్నీ పూర్తిచేసి ఆటో తోలుతూ సంపాదిస్తోంది.

అర్ధరాత్రనే భయం లేదు

నజ్మా మూడు షిఫ్టుల్లో ఆటో నడుపుతోంది. బురఖా ధరించి ఉదయం తొమ్మిదిగంటలకు ఆటో స్టార్ట్ చేస్తుంది. ఎండ వేడికి బురఖాలో ఎక్కువ సమయం ఉండలేక మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేస్తుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆటో నడుపుతోంది. మళ్లీ రాత్రి తొమ్మిది నుంచి రెండుగంటల వరకు విరామం లేకుండా నడుపుతుంది. ఇలా మూడు షిఫ్టుల్లో మొత్తం మీద రోజుకి ఐదు నుంచి ఆరు వందల వరకు సంపాదిస్తోంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు నజ్మా ధైర్యాన్ని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే నజ్మాను చూసిన ఓ హిందూ మహిళ కూడా ఆటో నడపడం మొదలు పెట్టింది. దీంతో ఆ మహిళ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగు పడ్డాయి. ఇలా ఇతరులకు స్ఫూర్తి నిలుస్తూనే, తన కష్టార్జితంతో హజ్ యాత్రకు వెళ్తానని చెబుతోంది నజ్మా.

అడుక్కునే కంటే...

‘‘పేదరికం ఉందని అక్కడా ఇక్కడా చేయి చాచకుండా కష్టపడి ఏ పనైనా చేసి గౌరవంగా బతకవచ్చు. ఆటో గేర్లు మారుస్తూ, ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తున్నాను. ఇక మహిళా డ్రైవర్‌గా నాకు రాత్రి సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బంది ఎదురుకాలేదు. ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వం వచ్చాక అర్ధరాత్రి బయటకు రావడానికి కూడా భయం వేయడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మాకు రక్షణ కల్పిస్తోంది. పరిస్థితులు మరింత దిగజారినప్పుడు అల్లా కాపాడతాడు’’ అని నజ్మా అన్సారీ ధైర్యంగా చెబుతోంది.

బ్యూటిప్స్



● వేప చెట్టు ఇంటి దగ్గర్లో ఉంటే వేరే సౌందర్యసాధనాలతో పనే ఉండదు. వేపాకులు, బెరడు, వేపనూనె ఔషధాలుగానే కాదు, సౌందర్య సాధనాలుగానూ ఉపయోగపడతాయి. ఎలాంటి చర్మ సమస్యలకైనా వేపతో ఇట్టే చెక్ పెట్టేయవచ్చు. ● ముఖంపై మొటిమలు, నల్లమచ్చలు ఏర్పడుతుంటే వేపాకులతో చక్కని విరుగుడు ఉంది. గుప్పెడు వేపాకులను అరలీటరు నీటిలో వేయాలి. వేపాకులు పూర్తిగా మెత్తగా మారిపోయేంత వరకు ఆ నీటిని మరిగించాలి. కాసేపటికి నీరు ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అప్పుడు వడగట్టి ఆ కషాయాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ నీటితో కాస్త దూదిని తడిపి ముఖాన్ని రుద్దుకుంటే చాలు. మొటిమలు, మచ్చలు మటుమాయం అవుతాయి. ● చర్మం పొడిబారి, తరచు దురదలు పెడుతున్నట్లయితే, పైన చెప్పుకున్నట్లే వేపాకులతో కషాయం చేసి, బకెట్ నీటిలో ఒకకప్పు కషాయాన్ని పోసి ఆ నీటిని స్నానానికి ఉపయోగిస్తే చాలు. కొద్దిరోజుల్లోనే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. ● ముఖం తరచు జిడ్డుగా మారుతుంటే, వేపాకుల పొడి, గంధంపొడి, గులాబి రేకుల పొడి సమభాగాలుగా తీసుకుని కలుపుకోవాలి. చెంచాడు పొడిలో మూడు నాలుగు చుక్కల వేపనూనె, కొద్దిగా తేనె, నిమ్మరసం పిండుకుని ముద్దలా కలుపుకోవాలి. దానిని ముఖానికి పట్టించి, అరగంటసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా మారుతుంది.

